అజాగ్రత్తే మింగేస్తున్నది..

- ఆ రేవుల్లో స్నానం ప్రమాదకరం
- ప్రాణాలు లాగేస్తున్న ఊబులు
- హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసిన అధికారులు

ఆలమూరు: ఆటవిడుపులో అజాగ్రత్తే మింగేస్తు 'న్నది'.. గోదావరి తీర ప్రాంతంలో ఇసుక తిన్నెలు, పలు రేవుల్లో ఊహించని ఊబులు మృత్యు కుహరంలా మారాయి..అయినవారికి కన్నీరు మిగుల్చుతున్నాయి.. విద్యార్థులకు వేసవి సెలవులు కొద్ది రోజుల్లోనే ఇవ్వనున్నారు.. సొంతూళ్లకు, బంధువుల ఇళ్లకు, సరదాగా పర్యటనలకు వచ్చే వారంతా నదీ తీరంలో స్నానాలు చేసేందుకు ఉవ్విళ్లూతుంటారు. ఆ సమయంలో కొందరి నిర్లక్ష్యం అనేక ప్రమాదాలకు దారితీస్తోంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు, అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల వెంబడి గౌతమీ, వశిష్ఠ, వైనతేయ నదులు ప్రవహిస్తుంటాయి. ఈ వేసవిలో ఆ నదుల వెంబడి స్నానాలు చేసేందుకు జిల్లా వాసులతో పాటు పర్యాటకులు ఆసక్తి చూపుతుంటారు. నదీ పరివాహక ప్రాంతంలోని ఇసుక దిన్నెల్లో అనేక చోట్ల ఊబులు ఉన్న సంగతి తెలియని కొందరు మృత్యువాత పడుతున్నారు. కుటుంబ సభ్యులకు తీరని శోకాన్ని మిగుల్చుతున్నారు. అలాంటి ప్రమాదకరమైన ప్రదేశంగా ఆలమూరు మండలం బడుగువానిలంక గోదావరి తీరంలోని రేవు ఉంది. పదేళ్ల కాలంలో అనేక మంది మృత్యువాత పడ్డారు. అధికారులు, ప్రజాప్రతినిధులు నష్ట నివారణ చర్యలు చేపడుతున్నా ప్రయోజనం కనిపించడం లేదు. ఈ ఏడాది ఏవిధంగానైనా ఒక్క ప్రమాదం కూడా జరగకూడదని గ్రామ పంచాయతీ నిర్ణయం తీసుకుంది. దానికి అనుగుణంగా ప్రత్యేక చర్యలు చేపట్టింది.



బడుగువానిలంకలో గోదావరి తీరాన ప్రమాదకర ప్రాంతం

మృత్యుకుహరాలు ఎన్నో..

216ఏ నంబరు జాతీయ రహదారికి కూతవేటు దూరంలో ఉన్న బడుగువానిలంక పుష్కర ఘాట్ సమీపంలోని గోదావరి రేవు వద్ద ప్రమాదకర ఊబి ఉంది. ఇక్కడ గడిచిన ఐదేళ్లలో ఏడు ప్రమాదాలు జరగ్గా తొమ్మిది మంది మృత్యువాత పడ్డారు. మూలస్థాన అగ్రహారంలో 2015వ సంవత్సరం మే 1న జరిగిన ప్రమాదంలో నలుగురు, జొన్నాడ రేవులో జరిగిన ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. దీంతో పాటు ఆత్రేయపురం మండలం పిచ్చుకలంక, వద్దిపర్రు, బొబ్బర్లంక ప్రాంతాల్లోని ఇసుక తిన్నెల్లోకి దిగి ఊబుల్లో చిక్కుకుని అనేక మంది గల్లంతైన సంఘటనలు ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో అధికారులు తగిన రక్షణ ఏర్పాట్లు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



బడుగువానిలంకలో మృతుని బంధువులను ఓదార్చుతున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి (ఫైల్)

అప్రమత్తం చేస్తున్నాం..



బడుగువానిలంక గ్రామంలో జరిగిన గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని గోదావరి నదీ పరివాహక ప్రాంతంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. ఇప్పటికే హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేసి ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారిని అప్రమత్తం చేశాం. గ్రామస్తులు కూడా ప్రమాదాల నివారణకు తమ వంతు సహకారం అందిస్తున్నారు.

–దూలం వెంకటలక్ష్మి, సర్పంచ్, బడుగువానిలంక

అవగాహన పెంచుతున్నాం..



జొన్నాడ నుంచి మడికి వరకూ ఉన్న నదీ పరివాహక ప్రదేశాల్లో పలుచోట్ల ప్రమాదకర ప్రదేశాలు ఉన్నాయి. దీనిపై వివిధ శాఖాధికారులను సమన్వయం చేసుకుంటూ ప్రజల్లో చైతన్యం తీసుకొస్తున్నాం. నదీ తీరంలో ప్రమాదాల నివారణే ధ్యేయంగా పోలీసు శాఖ పని చేస్తుంది.

–ఎస్.శివప్రసాద్, ఎస్సై, ఆలమూరు

క్లుప్తంగా

నీట్ విద్యార్థులకు అభినందన

ఆలమూరు: నీట్ ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబర్చి ర్యాంకులు సాధించిన గొడవర్తి ఫణిప్రియ, బొబ్బా ఉదయ్ కిరణ్‌లను పలువురు అభినందించారు. మురళీకృష్ణల సంస్థల అధినేతలు వంటిపల్లి కృష్ణమూర్తి, వంటిపల్లి, పాపారావు, గుమ్మిలేరు సర్పంచ్ గుణ్ణం రాంబాబు తదితరులు పెదపళ్ల, చింతలూరు గ్రామాల్లోని విద్యార్థుల నివాసాలకు వెళ్లి అభినందించారు. పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రతి ఎకరాకూ సాగునీరు



ఇసుకపూడి వద్ద పంట కాలువలో పూడికతీత పనులు

అంబాజీపేట: శివారు ప్రాంతాల్లోని ప్రతి ఎకరాకూ సాగునీరు అందించడమే లక్ష్యంగా పంట కాలువల్లో పూడికతీత పనులు చేపట్టామని ఇరిగేషన్ జేఈ జీఎస్ సుందర్‌సింగ్ చెప్పారు. ఇసుకపూడి- చిరతపూడి పంట కాలువలో పేరుకుపోయిన తుప్పలు, చెత్తా చెదారాన్ని పొక్లెయినర్‌తో గురువారం తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రూ.2.32 లక్షలతో ఈ పనులు చేపట్టామన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు.

ఇంటింటా సర్వే చేయాలి

అంబాజీపేట: ప్రస్తుతం ప్రజలు జ్వరాల బారిన పడే అవకాశాలు ఉన్నాయని, ప్రతి ఇంటికి వెళ్లి సర్వే చేయాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించాలని వైద్యాధికారి వి.గౌతమితో అన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని అంగన్‌వాడీ, ప్రాథమిక, జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు తగు సూచనలు చేసి ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందించాలన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు సూదాబత్తుల రాము పాల్గొన్నారు.

ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి

అంబాజీపేట: ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సర్పంచ్ కోట బేబిరాణి, వైద్యాధికారి గీతాంజలి అన్నారు. గురువారం చిరతపూడి ఎస్ఎస్ నగర్‌లో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి చెందిన వ్యక్తి డెంగీ బారీన పడి కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొంది సంపూర్ణ ఆరోగ్యంతో ఇంటికి వచ్చారన్నారు. ఆ ఇంటికి సమీపంతో పాటు కాలనీ వాసులకు వైద్య పరీక్షలు చేశామన్నారు. జ్వరం, దగ్గు, జలుబు తదితర లక్షణాలుంటే తక్షణమే వైద్యులను సంప్రదించాలన్నారు. సబ్ యూనిట్ అధికారి రాజాబాబు, హెల్త్ సూపర్‌వైజర్ ఎం.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రైతుల ఆందోళన

సఖినేటిపల్లి: పి.గన్నవరం ప్రధాన పంట కాలువకు శివారున ఉన్న వరి పొలాలకు సాగునీరు అందించాలంటూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం అక్కడి రైతులు ఆందోళన చేశారు. అనంతరం తహసీల్దార్ వై.రామకుమారికి రామేశ్వరం మాజీ సర్పంచ్ సరెళ్ల విజయ్‌ప్రసాద్ వినతిపత్రం అందజేశారు. సఖినేటిపల్లి లాకుల వద్ద తూటు, గుర్రపుడెక్క వల్ల సాగునీటి ప్రవాహం మందగించిందని రైతులు తెలిపారు. దీనిపై తహసీల్దార్ మాట్లాడుతూ నీటి ఎద్దడి నివారణకు వంతుల వారీగా ఇరిగేషన్ శాఖ సాగునీటిని విడుదల చేస్తోందని, రేపటికి మండలానికి నీరు వచ్చే అవకాశం ఉందన్నారు. బి.నారాయణరావు, వేదాల జ్యోతి, బొరుసు రామకోటి పాల్గొన్నారు.

130 మందికి కంటి పరీక్షలు

అయినవిల్లి: నేదునూరు ఆరోగ్య ఉప కేంద్రంలో వైఎస్సార్ కంటి వెలుగులో భాగంగా గురువారం కంటి పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ గుమ్మడి ప్రసాద్ ప్రారంభించారు. అప్తాలమిక్ ఆఫీసర్ కె.అరవింద్ ఫణికుమార్ 130 మందికి నేత్ర పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 80 మందికి కళ్లజోళ్లకు, 39 మందిని శస్త్ర చికిత్సలకు రిఫర్ చేశారు. ఎంపీటీసీ సభ్యుడు ఇందుగుల వెంకట్రామయ్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

అంబాజీపేట: పుల్లేటికుర్రు శివారు చినలంక వద్ద గురువారం ఓ వ్యక్తి గాయాల పాలయ్యాడు. కొత్తపేట మండలం పలివెలకు చెందిన లంక బాల వెంకటరమణ తన బైక్‌పై ముక్కామల నుంచి పలివెలకు వెళుతున్నారు. చినలంక వద్ద అదుపుతప్పి పడిపోవడంతో గాయాల పాలయ్యాడని స్థానికులు తెలిపారు. అతన్ని 108లో కొత్తపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఎస్టీయూ ఉద్యమ నేత మృతికి సంతాపం

మామిడికుదురు: ఎస్టీయూ రాష్ట్ర మాజీ అసోసియేట్ అధ్యక్షుడు గుబ్బల సత్యనారాయణ మూర్తి మృతికి ఆ సంఘం మండల శాఖ గురువారం సంతాపం తెలిపింది. స్థానిక ఎమ్మార్సీలో జరిగిన కార్యక్రమంలో సత్యనారాయణ మూర్తి చిత్రపటానికి యూనియన్ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘ అధ్యక్షుడు పీవీ రాఘవరావు, ప్రధాన కార్యదర్శి కె.కల్యాణ్‌బాబు, మట్టా నాగరాజు, కత్తుల రమేష్‌బాబు, వలవల శ్రీబాలాజీ, శిరిగినీడి శ్రీరామ్ పాల్గొన్నారు.

అంతర్వేది స్వామికి పూజలు



నరసింహ స్వామివారి ఆలయంలో డాక్టర్ పద్మ

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహుని ఆలయంలో స్వామివారికి గురువారం ఏపీ ఎండోమెంట్స్ ట్రిబ్యునల్ మెంబర్ డాక్టర్ ఎం.పద్మ ప్రత్యేక పూజలు చేశారు. తొలుత ఆమెకు స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామికి పూజలు అనంతరం అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. ఆమెకు స్వామి చిత్రపటం, ప్రసాదాన్ని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ అందజేశారు.

నేటి నుంచి ఆలయ వార్షికోత్సవం

ఆలమూరు: జొన్నాడలో వేంచేసి ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం నుంచి ఆలయ నాలుగో వార్షికోత్సవ వేడుకలు, కల్యాణ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఈ సందర్భంగా దాతలు గొడవర్తి సత్యనారాయణ మూర్తి, పద్మ దంపతులచే ఆలయ పురోహితుల కోసం నిర్మించిన భవనాన్ని ప్రారంభించనున్నారు.

నీటి సమస్య రానీయొద్దు

సఖినేటిపల్లి: మండలంలో దాళ్వాలో వరి చేలకు సాగునీటి సమస్య రాకుండా చూడాలని మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు ఇంజేటి శామ్యూల్‌రాజ్ అన్నారు. గురువారం సఖినేటిపల్లి సత్తిరేవు పుంత ఏరియాలో డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. పైరుపై శత్రు, మిత్ర పురుగుల గురించి అవగాహన, పురుగు మందుల వినియోగం, ప్రస్తుతం పైరుపై ఆశిస్తున్న తెగుళ్లు, వాటి నివారణపై అధికారులు సూచనలు చేశారు. సాగు చివరి దశకు చేరుకున్న తరుణంలో నీటి సమస్య రాకుండా చూడాలని పలువురు రైతులు కోరారు. ఏఓ పీవీ నరసింహారావు, సర్పంచ్ గొల్లమందల చిట్టిబాబు, వైస్ ఎంపీపీ-1 రాపాక దీవెనకుమారి, ఎంపీటీసీ సభ్యులు కట్టా వెంకాయమ్మ, నల్లి రత్నకుమార్, సలహా మండలి సభ్యుడు కొల్లాబత్తుల చిట్టిబాబు పాల్గొన్నారు.



సఖినేటిపల్లి పొలంబడిలో రైతులకు అవగాహన

కట్టుదిట్టంగా ఇంటర్ పరీక్షలు

అంబాజీపేట/కొత్తపేట/ఆలమూరు/రావులపాలెం: ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. పుల్లేటికుర్రు ఏపీఎస్ జూనియర్ కళాశాలలో 246 మంది విద్యార్థులకు 236 మంది హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్ ఎ.అనిల్ కుమార్ తెలిపారు. అంబాజీపేట ఎస్ఎన్ఎం కళాశాలలో 162 మందికి 161 మంది పరీక్షలు రాశారని చీఫ్ సూపరింటెండెంట్ కె.రవికుమార్ వివరించారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. కొత్తపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో 312 మందికి 305 మంది విద్యార్థులు పరీక్షలు రాశారని కళాశాల ప్రిన్సిపాల్, చీఫ్ సూపరిండెంటెంట్ ఏవీఎన్ బాలాజీ తెలిపారు. స్థానిక సిద్ధార్థ జూనియర్ కళాశాల కేంద్రంలో 339 మందికి 325 మంది హాజరయ్యారని ప్రిన్సిపాల్ కట్టా నాగమోహన్ తెలిపారు. డీఎస్పీ కేవీ రమణ పర్యవేక్షణలో రావులపాలెం సీఐ రజనీకుమార్ ఆధ్వర్యంలో ఎస్సై వి.మణికుమార్ బందోబస్తు నిర్వహించారు. ఆలమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు ఆలమూరు, అంగర మండలాలకు చెందిన నాలుగు కళాశాలల్లోని 252 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా ఐదుగురు గైర్హాజరయ్యారు. పరీక్షల ఏర్పాట్లను ప్రిన్సిపాల్ ఎస్వీ ప్రసాదరెడ్డి, డీఓ డి.సత్యనారాయణ మూర్తి పర్యవేక్షించారు. ఆలమూరు ఎస్సై ఎస్.శివప్రసాద్ నేతృత్వంలో బందోబస్తు నిర్వహించారు. రావులపాలెంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంలో ప్రభుత్వ, సత్యసాయి కళాశాలల విద్యార్థులు పరీక్షలు రాశారు. మొత్తం 439 మంది 415 మంది విద్యార్థులుహాజరైనట్టు చీఫ్ సూపరింటెండెంట్ టి.గంగావతి వివరించారు.



ఆలమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు

సమన్వయంతో ఉత్సవాలు విజయవంతం

నూకాంబిక అమ్మవారి జాతర ఏర్పాట్లపై ఆర్డీఓ సమీక్ష

ఆలమూరు: అధికారులంతా సమన్వయంతో చింతలూరు శ్రీనూకాంబిక అమ్మవారి ఉత్సవాలను విజయవంతం చేద్దామని ఆర్డీఓ ఎం.ముక్కంటి పిలుపునిచ్చారు. గురువారం చింతలూరులో అమ్మవారి ఉత్సవాలపై రెండో విడత సమీక్ష సమావేశం జరిగింది. ఆలయ ముఖ మండప ఆవరణలో ఈఓ ఉండవల్లి వీర్రాజు ఆధ్వర్యాన నిర్వహించిన ఈ సమీక్షకు ఆలయ కమిటీ చైర్మన్ నూకపెయ్యి సూరిబాబు అధ్యక్షత వహించగా ఆర్డీఓ ఎం.ముక్కంటి, డీఎల్‌పీఓ రామకృష్ణారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ నెల 20 నుంచి ప్రారంభం కానున్న ఉత్సవాలకు చేయాల్సిన ఏర్పాట్లు, సౌకర్యాల కల్పనపై మండల స్థాయి అధికారులతో చర్చించారు. జాతర, తీర్థ మహోత్సవాలకు విచ్చేసే భక్తులకు తప్పనిసరిగా తాగునీటి సౌకర్యం కల్పించి.. సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పాలని ఆర్డీఓ ఆదేశించారు. తీర్థంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎస్సై ఎస్.శివప్రసాద్‌కు తెలిపారు. తీర్థంలో అగ్నిమాపక శకటం ఏర్పాటు చేయడంతో పాటు వైద్య శిబిరాలు నిర్వహించాలని, విద్యుత్ సరఫరా నిరంతరాయంగా ఉండాలని సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేశారు. తహసీల్దార్ ఐపీ శెట్టి, ఎంపీడీఓ కె.జాన్‌లింకన్, ఈఓపీఆర్డీ పీఆర్‌సీ రాజ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ఎం.పోశమ్మ, సబ్ ఇంజినీర్ కె.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పార్కింగ్ రుసుం వసూలుకు నిర్ణయం

చింతలూరు జాతర, తీర్థ మహోత్సవాలకు వచ్చిన భక్తుల వాహనాలకు పార్కింగ్ రుసుం వసూలు చేయాలని దేవదాయశాఖ ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీ నిర్ణయించింది. ఈ మేరకు గ్రామ పంచాయతీ వేలం పాటలు నిర్వహించాలని ఆర్డీఓ ముక్కంటి పంచాయతీ కార్యదర్శి వెంకటరెడ్డిని ఆదేశించారు. సైకిల్‌కు రూ.10, బైక్‌కు రూ.20, ఆటోకు రూ.30, కారుకు రూ.50 వసూలు చేయాలని నిర్ణయించారు. ఉత్సవాలు ముగిసే వరకూ అధికారులంతా అందుబాటులో ఉండాలన్నారు. దీనిపై ప్రతి రోజూ ఉంటుందని ఆయన పేర్కొన్నారు.



చింతలూరులో నూకాంబిక అమ్మవారి ఉత్సవాలపై సమీక్షిస్తున్న ఆర్డీఓ ముక్కంటి

బందోబస్తు ఏర్పాట్ల పరిశీలన

చింతలూరులో 20 నుంచి ప్రారంభం కానున్న నూకాంబిక అమ్మవారి జాతర మహోత్సవాలను పురస్కరించుకుని నిర్వహించాల్సిన బందోబస్తు ఏర్పాట్లను కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ పరిశీలించారు. రావులపాలెం సీఐ ఎన్.రజనీకుమార్, ఆలమూరు ఎస్సై ఎస్.శివప్రసాద్‌తో కలసి ఆలయ పరిసరాలను పరిశీలించారు. తీర్థంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పంచాయతీ కార్యాలయం వద్ద పోలీసు అవుట్ పోస్టును ఏర్పాటు చేయనున్నామన్నారు. సుమారు 150 మంది పోలీసు సిబ్బందిని, మహిళా సంరక్షణ కార్యదర్శులను నియమిస్తామని వివరించారు.

19న బీఎస్పీ సమావేశం

పి.గన్నవరం: అంబాజీపేట బీఎస్పీ కార్యాలయంలో ఈ నెల 19న నియోజకవర్గ స్థాయి పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్టు ఆ పార్టీ ఇన్‌చార్జి కుసుమ వెంకటేశ్వరరావు తెలిపారు. దీనికి నియోజకవర్గంలోని మండల కమిటీలు, సెక్టార్, బూత్ కమిటీలు, కార్యకర్తలు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

యువకుడి మృతి

హనుమాన్ జంక్షన్ రూరల్: చెన్నై- కోల్‌కతా జాతీయ రహదారిపై ఏలూరు జిల్లా బాపులపాడు మండలం వీరవల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ఆ గ్రామంలోని ఆర్పీహెచ్ కాలనీ ఎదురుగా బైక్‌పై వెళ్తున్న ఇద్దరు యువకులను గుర్తు తెలియని వాహనం ఢీకొంది. బైక్ నడుపుతున్న రాయి తారక తేజ వంశీ (28) అక్కడికక్కడే దుర్మరణం చెందగా, వెనుక కూర్చున్న మాడుపల్లి బాల తలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని హుటాహుటిన పిన్నమనేని సిద్ధార్థ వైద్యశాలకు తరలించారు. కాగా మృతుడు తారక తేజ వంశీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం చిరుతపూడి గ్రామానికి చెందిన యువకుడిగా గుర్తించారు.

సీఎం జగన్‌తో పారదర్శక పాలన

మామిడికుదురు: కుల, మత, పార్టీలకు అతీతంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శక పాలన అందిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో ప్రజలంతా అండగా నిలవాలని జిల్లా గ్రీవెన్స్ అధ్యక్షుడు కటకంశెట్టి ఆదిత్య, జిల్లా వక్ఫ్ బోర్డు సభ్యుడు ఎండీవై షరీఫ్, నాయకుడు కుసుమ శ్రీధర్ అన్నారు. కరవాక సచివాలయం వద్ద వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు బొలిశెట్టి భగవాన్, జేసీఎస్ మండల కన్వీనర్ సిర్రా మణికుమార్ ఆధ్వర్యంలో గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, కార్యకర్తలకు ఈ నెల 18 నుంచి నిర్వహించే జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంపై అవగాహన సదస్సును గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఇంటి తలుపు తట్టి ప్రభుత్వం ద్వారా అందుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. సర్పంచ్ రేఖడి సత్యనారాయణ, సందాడి పార్థసారథి వర్మ, ఎంపీటీసీ మల్లాడి వడ్డీకాసులు, ఉచ్చుల విష్ణు, ఇందుర్తి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కరవాకలో గృహ సారథులకు కిట్లను అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

అభ్యంతరాలు ఉంటే తెలపండి

పి.గన్నవరం: రెండో పంటకు ఈ-పంట నమోదు కార్యక్రమం పూర్తయిన నేపథ్యంలో వాటిలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే 23వ తేదీలోగా ఆర్బీకేల వద్ద సరిచేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి కాకి నాగేశ్వరరావు సూచించారు. కుందాలపల్లిలో గురువారం రాత్రి జరిగిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. ఈ-పంట నమోదు జాబితాలను ఆర్బీకే సెంటర్ల వద్ద ప్రదర్శించినట్టు తెలిపారు. వాటిని రైతులు పరిశీలించి, తేడాలు ఉంటే సవరించుకోవాలని అన్నారు. పి.గన్నవరం ఏడీఓ జేఎస్వీ మోహనరావు, ఏఓ ఎ.కల్యాణ్‌కుమార్, సర్పంచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

అమరజీవి త్యాగాలు చిరస్మరణీయం



అంబాజీపేటలో శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యులు



ఆలమూరులో పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమంలో ఎంపీపీ తదితరులు



కొత్తపేటలో శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ఎంపీపీ గంగాధరరావు

కొత్తపేట: ఆంధ్రప్రదేశ్ అవతరణ కోసం పొట్టి శ్రీరాములు చేసిన త్యాగాలు మరువలేనివని ఎంపీపీ మార్గన గంగాధరరావు అన్నారు. శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని కొత్తపేట మండల పరిషత్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు షేఖ్ బడేమియా పాల్గొన్నారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక సంఘ భవనంలో, సమితి రోడ్డు, పాత బస్టాండ్ వద్ద పొట్టి శ్రీరాములు విగ్రహాలకు సంఘ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు సత్యవరపు జమీందార్, కొత్తపేట సంఘ అధ్యక్షుడు కోట్ల ప్రభాకర విశ్వేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి శ్రీఘాకోళ్లపు శ్రీనివాస్ పాల్గొన్నారు. అవిడి పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ రెడ్డి చంటి ఆధ్వర్యంలో, పలివెలలో మహాత్మా గాంధీ అధ్యయన సంస్థ తరఫున ఆ సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి దుళ్ల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

పి.గన్నవరం: స్థానిక అక్విడెక్టు పార్కులో శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పాటోలు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో నాయకులు పూలమాలలు వేశారు. మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పెంటపాటి శ్రీనివాస్, గణేశుల చినకొండలరావు, నల్లా పెదకాపు పాల్గొన్నారు. కె.ఏనుగుపల్లి పంచాయతీ కార్యాలయంలో మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు తోలేటి బంగారు నాయుడు ఆధ్వర్యంలో శ్రీరాములు జయంతిని నిర్వహించారు. ఎంపీటీసీ కొల్లే సూర్యనారాయణ, గుర్రం చింతన్న పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

అంబాజీపేట: అంబాజీపేట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతిని నిర్వహించారు. వైస్ ఎంపీపీ నేతల నాగరాజు, ఎంపీడీఓ ఐ.రత్నంరాజు పాల్గొన్నారు. గంగలకుర్రు అగ్రహారంలో సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఎంఎం శెట్టి, వక్కలంక పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ వాసంశెట్టి రేవతి, నాయకుడు వాసంశెట్టి పెదబాబు, తొండవరంలో సర్పంచ్ పేరాబత్తుల దొరబాబు ఆధ్వర్యంలో శ్రీరాములు జయంతి వేడుకలు నిర్వహించారు.

అయినవిల్లి: తొత్తరమూడిలో సర్పంచ్ వారా జయ సావిత్రి ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద జయంతి కార్యక్రమాలు నిర్వహించారు.

రాజోలు: స్థానిక ఆర్యవైశ్య సంఘం, వాసవీ వనితా క్లబ్, వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఆర్య వైశ్య కల్యాణ మండపం వద్ద పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కేతా శ్రీనివాస్ ఆధ్వర్యంలో శ్రీరాములుకు నివాళులర్పించారు.

ఆలమూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీఓ ఎం.ముక్కంటి, తహసీల్దార్ ఐపీ శెట్టి, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, ఎంపీడీఓ కె.జాన్‌లింకన్, ఎంఈఓ కార్యాలయంలో ఎంఈఓ డి.మురళీ సత్యనారాయణ, స్థానిక జూనియర్, డిగ్రీ కళాశాలలో అధ్యాపక బృందం ఆధ్వర్యంలో శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేశారు.

రావులపాలెం: స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి తదితరులు పొట్టి శ్రీరాముల చిత్రపటానికి పూలమాలలు వేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు కర్రి వీర్రెడ్డి, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ తదితరులు, అలాగే వ్యవసాయ మార్కెట్ కమిటీ వద్ద ఉన్నత శ్రేణి కార్యదర్శి వి.యశ్వంత్ రావు తదితరులు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులు అర్పించారు.

వాహనాల తనిఖీ

ఆలమూరు: కొత్తూరు సెంటర్‌లో స్థానిక ఎస్సై ఎస్.శివప్రసాద్ నేతృత్వంలో గురువారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ద్విచక్ర వాహనదారుల రికార్డులను పరిశీలించి లైసెన్స్ లేని వారికి అపరాధ రుసుం విధించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.